# ఎన్. జి. ఓ. లు

రచన:
దివాకర్ల సుధారాణి.

ఆ ఆఫీసులో, యిదివరకెప్పుడూ లేని సందడి ఈనాడు ప్రత్యేకం కలగడానికి కారణం. ఊహించడానికి, ఆ బ్రాంచ్ యిన్‌ఛార్జిగారికి అట్టే కాలం పట్టలేదు.

మధుర మందస్మితవదనంతో తెల్ల వాయిల్ బట్టల మధ్య, ముగ్ధమోహనలావణ్యంతో దాగి ఉన్న అరవింద—హంసగమనంతో వచ్చి, అందరికీ చివరనున్న యిన్‌ఛార్జిగారి టేబుల్ ప్రక్కన కూర్చొని తామరకాడలాంటి సన్నని వేళ్ళలో వీణమీటినట్లు టైపు చేసుకు పోతున్న సుందరాంగి కనబడుతూ ఉంటే 'ఎందుకా?' అని ఆలోచించే అవసరం ఎవరికైనా (మనకైనా) ఎందుకు కలుగుతుంది.

'ఓహో! అందుకా మార్పు' అనుకున్నారాయన - అరవింద అందాన్ని రెండుక్షణాలు రెప్పవాల్చకుండా చూసి, ఆ రెండు క్షణాల్లోనూ తమకు దక్కవలసిన ఛాన్సు ఆయనెక్కడ తన్నుకుపోతాడో అని, రెండుమూడు హెడ్ ఆఫీసు లెటర్సు పట్టుకొని యిద్దరు, ఎన్.జి.ఓ.లు వగర్చుకుంటూ ఆయన్ని చుట్టుముట్టారు.

తప్పనిసరిగా దృష్టి మరల్చుకోలేక తప్పింది కాదు ఆయనకు. లెటర్సు ఆయన ముందు పడేసి. ఒకరికి తెలీకుండా ఒకరు మొత్తంమీద అందరూ, అరవింద అందాన్ని కళ్లతోనే రుచి చూసి, అప్పారావు బాకీ, పడుచు పెళ్ళాంపట్టు చీర, ముసలమ్మ సైను పంచె, పాలవాడి పద్దు, సెట్టిగారి పాతబాకీ-ఆ రెండు క్షణాలు మర్చిపోయి. ఎవరికి వారు అరవింద హీరోయిన్‌గా ఎంచుకొని ఊహల్లో కాల్లోకి పరుగెత్తారు.

'బాబూ దొరగారు పిలుస్తున్నారు' అన్న కేక అందర్నీ మళ్ళీ ఈలోకంలోకి తీసుకొచ్చి పడేసింది. యిన్‌ఛార్జిగారు ఫ్యాన్ వెనక ఎన్.జి.ఓ.లు తమ తమ సీట్లకి చేరుకున్నారు బరువుగా.

రెండురోజుల్లో ఆఫీసు యావత్తూ భారీ ఎత్తున మారిపోయిందనడంలో సందేహం లేదు. రోజూ-షర్టు ఫేంటులో తోసి గోనె మూటకి తాడు కట్టినట్లు ఓ బెల్టు బిగించి, కుక్క తోకలా వేలాడుతున్న బెల్టుకొసని లక్ష్యపెట్టకుండా ఆదరాబాదరాగా వచ్చే యిన్‌ఛార్జిగారు చక్కని మడత నలగని తెల్ల బట్టలు వేసుకోని (అరవింద తెల్లలే కట్టింది గనక) టింగ్‌రంగా అంటూ ఆఫీసులో అడుగు పెట్టడంలోనూ, ఎన్.జి.ఓ. లంతా పాతకాలపు సంచెలు, కోట్లు, మూలపడేసి, తెల్లని మల్లె పువులాంటి షర్టు అంతకంటే తెల్లని ఫేంటులో టక్ చేసి, అందంగా, లాలీగా, రంగులు తిప్పుకున్న తలకో, యిద్దరు ముగ్గురు ఎన్.జి.ఓ.లు పాతపెళ్లినాటి కొత్తసూట్లు దుమ్ముదులిపి తీసుకొస్తున్నారంటే ఆశ్చర్యమెందుకూ మనకి.

మునుపు (అరవింద రాకపూర్వం) అయిదు గంటల నుండే అయిదున్నరకోసం గోడనున్న గడియారంవైపు మొఖమెత్తి చూస్తూ, అది తప్పు తిరుగుతున్నదేమోనని, ప్రక్కనున్న గుమస్తా, రిష్టువాచీలో చూసి తిట్టుకుంటూ

ఉండే స్టేఫ్ ఇప్పుడు-వెధవది ఇప్పుడే లైమైందా, మరోగంట ఆగి కొడితే దిని సొమ్ము పోయిందో-వెధవ గడియారం అంటూ ఉంటే కలికాలం చూశావా ఎలాగుందో అంటూ ముక్కు-మీద వేలేసుకున్నట్లు, పెద్ద ముల్లు పన్నెండుమీద, చిన్నముల్లు అయిదు మీద ఉంచి నవ్వేది గడియారం, అరవిందవైపు చూసి, అయిదుసార్లు.


అరవింద లేచేవరకూ ఎవ్వరూ లేవరు. వాళ్లు లేచినా వాళ్ళ మనసు లొప్పవు. ఇంటి దగ్గర కొత్తపెళ్ళాం సినీమా కెళదాం త్వరగా రమ్మన్నా అరవిందరూపం అడ్డొస్తుంది.

ఆరున్నరదైం తరవాత అరవింద లేచి అందంగా చీర సవరించుకొని, చకచకానడుస్తూ ఆఫీసు వదిలాక, ఆ బ్రాంచి అంతా దీర్ఘ నిట్టూర్పులతో నిండి పోతుంది.

——ఆనాడు యిన్ ఛార్జిగారు, అకారణంగా భార్యను పుట్టింటికి పంపేసి——చిన్నపిల్లాడు పుట్టిన రోజు పండక్కి తొడుక్కున్న కొత్తబట్టల్లా సూటేసుకొని (ముందురోజే అప్పుచేసి అర్జెంటుగా కొన్నది) హాయిగా ఆఫీసులో అడుగు పెట్టిన ఆయనకి గుండె రెండు క్షణాలు ఆగి మళ్లీ కొట్టుకోవడం మొదలెట్టింది వేగంగా-కారణం అరవింద కుర్చీలో లేదని మీరు ఊహించే ఉంటారు-యిన్ ఛార్జిగారి టేబుల్ మీదున్న వారంరోజుల సి.ఎల్. కాగితం అసలు విషయం ముచ్చటగా విన్నవించింది.

మరో రెండు నిమిషాల్లో వైర్ లెస్ మెసేజ్ లా వ్యాపించిందా వార్త ఆఫీసంతా.

'ఆనాడు ఆఫీసులో——



'మిస్టర్ వెంకట్రావ్,' యిన్ ఛార్జిగారి పిలుపు.

'లేదు సార్.' బాబురావు సమాధానం.

'నువ్వోసారి యిలా రావోయ్.'

'తలనొప్పి. కళ్లు బరువు, కాళ్లు పీకూ సార్...'

'మిష్టర్ గురుమూర్తీ.'

'.........?'

'గురుమూర్తీ!!!'

'వ...స్తున్నా...సా...ర్.'

'పిలిచిన గంటకా రావడం?'

'యివాళ వంట్లో బాగులేదండి'

'ఏం?'

'ఏ...మో...నం...డీ'

'నిన్నటి హెడ్ ఆఫీస్ ఫైల్స్ డిస్పేజ్ చేశారా?'

యింకా... లే...దండీ'

'గో...సెండ్ దోజ్ ఫైల్ టు డే!'

అతను వెళ్లాక తనకికూడా తల నొప్పిగా ఉన్నట్లనిపించింది——యిన్ ఛార్జిగారికి.

లంచ్ టైము కాకుండానే లాంచనంగా గుమికూడారు ఎన్ జి.ఓ లంతా కాంటిన్ లో.

అందరూ మాట్లాడుకోగా చేరిన విషయమేమిటంటే ఆఫీసుకి రాగానే అందరికి తల నొప్పి వచ్చిందనే కారణం మాత్రం ఎవరూ వెల్లడి చెయ్యలేదు.

'ఆఫీసులో ఎవరూ సరిగా పని చేయలేదు. లంచ్ టైమ్ కాకుండానే వెళ్లిపోవడం, లేటుగా రావడం, ప్రక్కవారితో కబుర్లు చెప్పడం బాగులేదు' అంటూ ఓ ఆఫీస్ ఆర్డర్ వెల్లడి చేశారు యిన్ ఛార్జిగారు-గుమస్తాలందరికీ.

'యిన్నాళ్లూ ఎప్పుడైనా యిలా జరిగిందా, వళ్ళల్లో బాగులేదు గనక-పని ఆగిపోయింది. ఆ మాట కొస్తే యిన్‌ఛార్జిగారిదే తప్పు. ఎప్పుడు ఫైల్సు పట్టుకెళ్ళినా, యిదా టైమ్ బిజీగా ఉన్నానని పంపేస్తున్నారని మేమూ రిపోర్టు చేస్తాం' అన్నారంతా.

'అది కాదోయ్ మనలో మనకి గొడవ లెందుకూ ఎవరి పనులు వారు చేసుకు పోవాలి మీకు మాత్రం తెలీదు ఏదో పెద్ద వాణ్ని గనక మీకు చెప్తున్నాను.' అంటూ చప్పరించాయన-తప్పు తనలో కూడా ఉంది గనక.

బరువుగా గడిచి పోయింది కాలం-వారం రోజులూ.

——ఆరోజు మళ్ళీ కళకళ్ళాడుతోంది ఆఫీసు-పావు తక్కువ పదికే సంక్రాంతినాడు తలకి స్నానం చేసి కొత్త వస్త్రాలు ధరించినట్లు, అంత నీటుగా ముస్తాబై ఎవరిసీట్లులో వాళ్ళు హాజరై ఓరకంటితో ద్వారం వైపు మాత్రం చూస్తున్నారు కారణం ఆరోజు అరవింద వస్తుం దని మనకి తెలుసు సమ్మెట పోటులా ఠంగ్.. ఠంగ్.. మంటూ పదకొండు కొడుతూండగా అందంగా అడుగు పెట్టింది స్వేచ్ఛగాలి పీల్చి తేలిగ్గా నిట్టూర్చింది ఆఫీసంతా అరవిందని చూసి.

కానీ ఆ సంతోషమంతా క్షణంలో హారతి కర్పూరంలా హరించుకు పోయింది క్షణంలో. గుడ్లు తేలేసి సీట్ల కంటుపోయింది స్టేఫ్ అంతా. 'అరవిందని కన్నెత్తి చూడ్డానికి వీల్లేదు—ఆమె లైసెన్సు పుచ్చుకుంది-' అంటూ చిరునవ్వుతో పలకరించింది కొత్తమంగళసూత్రం-



# - రిటైర్ -

రచన: మాస్టర్ రవి

రిటైరై పోవడం అనే పద్ధతి ఎందుకుందో, ధర్మయ్యని చూస్తే తెలుస్తుంది.

పేరుచూసి మోసపోకండి. ఆయన ఎన్నో అధర్మకార్యాలు చేసి, ఎందరి జీవితాల్లోనో నిప్పులు పోసి, ఎంతమంది కాపురాలనికూర్చి, ఎంతమందినో ఆత్మహత్యకు పాల్పడిజేసి-ఈ నాడు ఊళ్ళో ఒక పలుకుబడిగల వ్యక్తిగా, ధనవంతుడిగా బ్రతకగలుగుతున్నాడు.

రిటైరయి పోయే సమయం వచ్చినా, అతనికి, అలా అవడానికి ఏమాత్రమూ ఇష్టం లేదు. ఎంచేతంటే, అతనికింకా ధనదాహం; కామ దాహం-ఇత్యాదివేవీ తీరకపోవడమే.

మరో చెప్పుకోదగ్గ ముఖ్య గమనిక ఏమి టంటే-అతని కన్న ఎవరన్నా బాగున్నా రన్నా; బాగున్నారని విన్నా; కష్టపడి పని చేస్తున్నారని తెల్సినా, కళ్ళల్లో నిప్పులు పోసు కుంటాడు. ఇంతటి ఈర్ష్యాపరుడు మరోడుండడు. అతడి కతడేసాటి.

కుటుంబం గడవక; చేతికంది వచ్చే మగ పిల్లలు లేక; ఉద్యోగం చేసే చదువు లేక పోయినా, గుండెల మీద కుంపటిలా ఎదిగిన ఆడపిల్లలు ఇంట్లో ఈకొసనుంచి ఆ కొసకి తిరు గుతూండడం చేత; వేరే గత్యంతరం కానక